క్లుప్తంగా

27న జాబ్‌మేళా

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సగిలిప్రకాష్‌రావు మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ చదివిన విద్యార్థులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ ట్రైనర్ మోహన్ కుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

నియామకం


బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు : ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యకు మెంబర్ పోస్టు దక్కింది. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మెంబర్‌గా ఆయనను నియమించారు.

బాధ్యతల స్వీకరణ

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఆయన కమిషనర్‌గా మైదుకూరుకు బదిలీ అయ్యారు. గతంలో ఆయన మైదుకూరు మున్సిపాలిటీలో కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. మంగళవారం కమిషనర్ శ్రీనివాసులరెడ్డి మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రను సత్కరించారు. అనంతరం మున్సిపాలిటీ అభివృద్ధిపై వారు చర్చించారు.

రేపు దళితుల సమస్యలపై సమావేశం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఎన్జీవో హోంలో నియోజకవర్గంలోని దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారంపై ఆంధ్రప్రదేశ్ దళితవేదిక రాష్ట్ర అధ్యక్షులు రెడ్డెన్న ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఓబయ్య, జిల్లా కన్వీనర్ ఓబులేసు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యోహాన్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారంపై నిర్వహించే ఈ సమావేశానికి ఆర్డీఓ చంద్రమోహన్, డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కలసపాడు : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మంగళవారం మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్ వాడటం వల్ల లాభనష్టాలు ఉన్నాయని, చదువుకుని ఒక స్థాయికి వచ్చిన తర్వాత వాడాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ రెడ్డిజ్యోతి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణలో ప్రతిభ

బద్వేలు అర్బన్ : కడప నగరం తెలుగుగంగ కాలనీలోని ఎన్‌సీసీ 30 ఆంధ్రా బెటాలియన్‌లో నిర్వహించిన సీఏటీసీ-7 క్యాంపులో వివిధ అంశాల్లో స్థానిక ఫాతిమా ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్, సిస్టర్ జ్యోతిశ్య వివరాలు వెల్లడించారు. తమ పాఠశాలకు చెందిన ఎం.నాయబ్‌రసూల్ గన్‌ఫైరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అలాగే బెస్ట్ డ్రిల్ విభాగంలో ఎస్.గురుహర్షిత్, కల్చరల్ విభాగంలో రామ్‌చరణ్ విజేతలుగా నిలిచారన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ హైదర్ హుస్సేన్‌ను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మైదుకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో మైదుకూరు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ నిర్వహించిన అండర్-14 రెజ్లింగ్ పోటీల్లో ఇస్మాయిల్, కళ్యాణ్, నవీన్‌కుమార్, రవితేజ, హసన్ తదితర విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినులు వినోనియరాణి, చంద్రావతి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సేంద్రియ ఎరువులు శ్రేయస్కరం

చాపాడు : పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని, వీటి స్థానంలో సేంద్రియ ఎరువులు వాడటం శ్రేయస్కరమని నవ భారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డు ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని చిన్నగురువకలూరు, అల్లాడుపల్లె గ్రామాలలో మంగళవారం రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూమిలో సారం తగ్గిపోయి దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు.

బకాయిలు చెల్లించకపోతే ట్రెజరీల ముట్టడి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా

మైదుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు వచ్చే నెల ఆఖరుకల్లా చెల్లించకపోతే జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాలను ముట్టడిస్తామని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మైదుకూరులోని ఎంఈఓ ఆఫీసు ఆవరణలో ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరాజు అధ్యక్షతన జరిగిన రీజనల్ సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతాల నుండి ప్రతి నెలా మినహాయించి, వారి ఖాతాలలో పొదుపు చేసుకున్న సొమ్మును కూడా నెలల తరబడి చెల్లించకుండా, ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్ ఖాన్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. హెల్త్ కార్డులు పనిచేయక, వైద్య ఖర్చుల నిమిత్తం అప్పులు చేసి, చెల్లించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను రకరకాల కారణాలతో పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. 12వ పీఆర్సీలో జరుగుతున్న జాప్యం కారణంగా వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలే తప్ప జీపీఎస్, యూపీఎస్ లాంటి ఏ ప్రత్యామ్నాయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు రీజియన్ పక్షాన ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎంఈఓలు పద్మలత, నరహరిశర్మ, సీపీఎస్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ యు.సుబ్రహ్మణ్యం, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.రామ్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్లు పాలకొండయ్య, వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశ్వరరెడ్డి, సురేష్, మీర్‌సాబ్, నాగేంద్ర, రమేష్, మైదుకూరు, దువ్వూరు మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత.. ఆరోగ్య భద్రత


ప్రొద్దుటూరు క్రైం : స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, పారిశుధ్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని కామనూరు హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోపవరం ఐదో సచివాలయంలో పని చేస్తున్న శానిటరీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ చంద్రకళ, సాంఘిక సంక్షేమ సంఘం వసతి గృహ సంక్షేమాధికారి రామకృష్ణారెడ్డి, సీహెచ్ఓ నాగలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోపవరం : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గోపవరం దళితవాడలో పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డ్రైనేజీ కాలువల్లో పూడికలు తీయడంతోపాటు దోమలను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టారు. పెద్దగోపవరంలో తాగునీటి పథకాలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రవీణ్, మహేశ్వరి, ఏఎన్ఎం సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం


మహమ్మద్ గౌస్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ బొల్లవరం మహమ్మద్ గౌస్(అక్రమ్)పై బుధవారం అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. బ్యాంక్‌కు సంబంధించి మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహమ్మద్ గౌస్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. వాస్తవానికి డైరెక్టర్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులే ఎక్కువ మంది ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు యెల్లాల కుమార్‌రెడ్డి స్థానంలో బొగ్గుల వెంకట సుబ్బారెడ్డిని ఇటీవల ఎన్నుకోవడం జరిగింది. ప్రస్తుతం అదే కోవలో తమ అనుచరుడికి వైస్ చైర్మన్ పదవి ఇప్పించేందుకు టీడీపీ నేతలు వ్యూహం రచించారు. ఇందులో భాగంగానే అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం చేశారు. ముక్తియార్ వర్గీయుడైన ఖలీల్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాలనే యోచనలో ఉన్నారు.

26న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

బద్వేలు అర్బన్ : స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26న నిర్వహించే నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను జయప్రదం చేయాలని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల కన్వీనర్ ఎస్.బాలయ్య తెలిపారు. మంగళవారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగం క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీడీలు నాగేశ్వర్‌రావు, కొండయ్య, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘టీటీడీ ప్రసాద తయారీలో అపచారం జరగలేదు’


ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల(అట్లూరు): పాలనలో ఘోరంగా విఫలమైన చంద్రబాబు ప్రజలను ఏమార్చేందుకే చివరకు దేవుడి ప్రసాదంపైనా విష ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విమర్శించారు. పోరుమామిళ్ల పట్టణంలోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీలో ఎలాంటి అపచారం జరగలేదన్నారు. కేవలం రాజకీయ కుట్ర కోణంలోనే చంద్రబాబు దీనిపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కనుక వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు చంద్రబాబు ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారన్నారు. దానిపై చంద్రబాబు గతి తప్పి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు దుష్ప్రచారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుతో సహవాసం చేసినందుకు ఆయనను నెత్తిన పెట్టుకున్నందుకు ప్రాయశ్చిత్తంగా పవన్‌కళ్యాణ్ దీక్ష చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.

చందాలతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పూడికతీత


పెండ్లిమర్రి వద్ద డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో పూడిక తీస్తున్న జేసీబీ

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పూడిపోయి పంట కాలువలకు నీరు అందకపోవడంతో రైతులు చందాలు వేసుకుని యంత్రాల ద్వారా కాలువ పూడికతీతను చేపట్టారు. పెండ్లిమర్రి చెరువు కింద సుమారు 200 ఎకరాల్లో ఆయకట్టు మాగాణి భూములు ఉన్నాయి. తెలుగుగంగ ఎడమ కాలువ పరిధిలోని మామిళ్లపల్లె నుంచి సాగునీరు అందుతుంది. కాలువ ఎక్కువ లోతుగా ఉండటం వల్ల మట్టితో పూడిపోయి.. తెలుగుగంగ జలాలు కాలువ నుంచి వెళుతున్నప్పటికీ ఈ ఏడాది చెరువుకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు పలుమార్లు రైతులు సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో పెండ్లిమర్రి రైతులు స్వచ్ఛందంగా చందాలు వేసుకుని కాలువలో పూడికతీత పనులు చేయించారు. పెండ్లిమర్రి చెరువు పరిధి చుట్టూ మహానందిపల్లె, మామిళ్లపల్లె, పెండ్లిమర్రి, నల్లగొండుపల్లె, లింగారెడ్డిపల్లె గ్రామాలు ఉన్నాయి. చెరువులో నీరు ఉంటే చుట్టుపక్కల వ్యవసాయ బోర్లతోపాటు రైతులకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు సమృద్ధిగా అందుతుంది. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా సమస్యను పరిష్కరించకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా యంత్రాల సాయంతో కాలువ మరమ్మతు పనులు చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు పూర్తి స్థాయిలో చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కాశినాయన : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఒత్తిడిని తగ్గించేందుకు సుదర్శన క్రియ యోగా దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ బెంగళూరు ఆశ్రమానికి చెందిన సాయికిరణ్, సంఘసేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా, బెట్టింగ్‌ను నిర్మూలిస్తాం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 38, 39, 40, 41 వార్డులకు సంబంధించి మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత వార్డుల్లో టీడీపీకి అత్యధిక మెజారిటీ వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నేతలు సీఎం సురేష్‌నాయుడు, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, నంద్యాల రాఘవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గోపవరం : మండలంలోని చిన్న గోపవరం గ్రామానికి చెందిన బుర్రివరద కుటుంబానికి బద్వేలు అఖిల భారతీయ యాదవ సంఘం ఆధ్వర్యంలో రూ.1.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బుర్రివరద బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లగా అక్కడ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. మృతునికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే కుటుంబ పెద్ద మృతిచెందిన విషయాన్ని యాదవ సంఘం వారు గుర్తించి ఈ మేరకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్, గోపవరం సర్పంచ్ వెంకటలక్షుమ్మ, సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురవలూరు గ్రామం జంబరపు ప్రతాప్‌కు చెందిన బండెద్దు మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం మిడుతూరు పొలం సమీపంలోని నల్లవాగు వంక దగ్గర రైతు వరి సాగు చేశాడు. మంగళవారం పైరుకు ఎరువులు చల్లించేందుకు పొలం వద్దకు బండెద్దులతో వెళ్లాడు. పొలంలో ఎరువులు చల్లుకుంటుండగా సమీపంలోనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒక ఎద్దు ప్రమాదవశాత్తు తగులుకుని విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.2 లక్షలు అని బాధితుడు తెలిపాడు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 1047, 1048, 1053, 64/1, 65/1లో గల 57.15 ఎకరాల విస్తీర్ణంలో గల సిద్ధమ్మతల్లి హౌసింగ్ లేఅవుట్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. హౌసింగ్ లేఅవుట్‌లో 1568 పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వగా 11 ఓపెన్‌స్పేస్‌లు ఉండేవని, అందులో ఒక్కొక్కటి 50 సెంట్లు గల మూడు ఓపెన్‌స్పేస్‌లలోని 1.50 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వాటిని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, టీపీఓ చంద్రమోహన్, టీపీబీఓలు నర్సయ్య, జయరామ్‌రెడ్డి, గంగయ్య, ప్లానింగ్ సెక్రటరీలు సుధాకర్‌రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మహిహ అనే విద్యార్థినిని చితకబాది ఆసుపత్రి పాలు చేసిన ఉపాధ్యాయురాలు వసంతరాణిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమ అనే విద్యార్థిని తరగతి గదిలో వేరే విద్యార్థినితో మాట్లాడిందన్న కారణంతో ఇష్టమొచ్చినట్లు కొట్టడంతో ఆసుపత్రి పాలైందని అన్నారు. సున్నితంగా మందలించాల్సిన విషయానికి ఆసుపత్రి పాలయ్యేలా కొట్టడం సరికాదని అన్నారు. గత నాలుగు రోజులుగా విద్యార్థిని కడప రిమ్స్‌లో చికిత్స పొందుతుంటే విద్యాశాఖాధికారి పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్, ఖలీల్, మాబీరా, ఐద్వా మహిళా సంఘం నాయకురాళ్లు మోక్షమ్మ, ఖైరున్‌బీ, ఫాతిమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఉపాధి పనులు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదనపు సంచాలకులు నాగరత్నమ్మ

రాజుపాళెం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సక్రమంగా చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు సంచాలకులు నాగరత్నమ్మ పేర్కొన్నారు. రాజుపాళెంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం అమలులో తప్పులు దొర్లకుండా చూడాలని తెలిపారు. మస్టర్ల దగ్గర నుంచి పనులు చేపట్టడంలో అన్ని సక్రమంగా ఉండాలని సూచించారు. కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని పేర్కొన్నారు. పర్లపాడు, కూలూరు గ్రామ సచివాలయ భవనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయించి, అందుకు సంబంధించిన ఫొటోలను అందించాలన్నారు. సచివాలయ భవనాల పనులు కూలీలకు కల్పించినందుకు మండలంలో రూ.7.30 కోట్లతో పనులు చేయడం జరిగిందన్నారు. అందులో పనుల వద్ద నేమ్ బోర్డులను ఏర్పాటు చేయలేదని, మస్టర్లలో తప్పులు ఉన్నందున రూ.38,191 రికవరీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి, ఏపీడీ రామలింగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ షాకీర్‌ఆలీఖాన్, ఎస్‌పీఎం లోకేశ్వర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి మధుసూదన్, ఎస్ఆర్పీ కన్నా రెడ్డి, ఏపీఓలు లక్ష్మీనారాయణ, గంగయ్య, ఈసీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెస్ బిల్లులు విడుదల చేయాలి


పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు, విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు కల్చరల్ : పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. స్థానిక నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం-1 వద్ద పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలలుగా మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయక పోవడంతో ప్రతి నెల కాలేజీ హాస్టల్ వార్డెన్‌కు రూ.1.40 లక్షలు, ప్రీమెట్రిక్ హాస్టల్ అయితే రూ.90 వేల దాకా ఖర్చు అవుతోందన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించక పోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకుడు శివాజీ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


పాడిరైతులకు ఖనిజలవణ మిశ్రమాలు అందజేస్తున్న పశుసంవర్ధక ఉప సంచాలకులు

బద్వేలు అర్బన్ : రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని పశువులను సంరక్షించుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ టి.వి.రమణయ్య, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సిద్దుగారిపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో ఆయన మాట్లాడుతూ పశువులన్నింటికీ సకాలంలో టీకాలు వేయించడంతోపాటు వ్యాధులు ప్రబలకుండా పశువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 28 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 36 దూడలకు నట్టల నివారణ మందులు, 12 పశువులకు, 184 గొర్రెలకు సాధారణ చికిత్సలు అందించారు. అనంతరం పాడి రైతులకు ఖనిజలవణ మిశ్రమాలను అందజేశారు. శిబిరంలో పశువైద్యాధికారులు డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎన్.నరసింహారెడ్డి, డాక్టర్ ఆర్.క్రిష్ణవేణి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు భవనాలు నిర్మించాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు కళాశాల విద్యార్థులతో కలిసి మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరులో గత ఏడాది ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రాథమిక పాఠశాల భవనాల్లో ప్రారంభించారని తెలిపారు. ఇందులో దాదాపు 198 సీట్లు ఉండగా సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తక్కువ మంది కళాశాలలో చేరుతున్నారన్నారు. ప్రస్తుతం 76 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరిపడా గదులు లేవన్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు సరిపడా తరగతి గదులను, కళాశాల పాలనా భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ నాయకులు నందకిశోర్, కె.నవీన్ కుమార్, సాయిరాం, డి.ఆదిత్య, బి.తేజ సాయిరాం, పి.తేజ, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సుధాకర్ యాదవ్

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని మడూరు గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, బయపురెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, హర్ష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని చెంచుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమూర్తి, ఏఓ మ్యాగి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, మిల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- చిన్నవరదాయపల్లెలో కొన్ని రోజులుగా అధ్వానంగా ఉన్న డ్రైనేజీని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఈ డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి


ప్రొద్దుటూరు : రైతులకు పంటల సాగుపై వివరిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఆధునిక పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రంగసాయిపురం, కాకిరేనిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్వరి, మండల వ్యవసాయాధికారి శివశంకర్, వీఏఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని చిన్నశెట్టిపల్లె, పొట్టిపాడు గ్రామాల్లో సాగు చేసిన మినుము, కంది పంటలను మండల వ్యవసాయాధికారి ఎస్.శివరామకృష్ణారెడ్డి పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏ జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మండలంలోని శివపురం, డయాంఖాన్‌పల్లె పంచాయతీలో వ్యవసాయ అధికారి పి.లక్ష్మీప్రసన్న వరి పంటను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ గురివిరెడ్డి, సిద్ధారెడ్డి, హరిత, మధు తదితరులు పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, ఏఈఓ విజయ్, రైతులు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని ఎగువ తంబళ్లపల్లె, దిగువ తంబళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్, వీఏఏలు మునికుమారి, పశుసంవర్ధక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమానికి కొందరు నాయకుల డుమ్మా


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

కాశినాయన : మండలంలోని టీడీపీలో వర్గవిభేధాలు బయటపడ్డాయి. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. అయితే మండలంలోని టీడీపీ వర్గీయులు రెండు గ్రూపులుగా విడిపోయారు. పూర్వం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న వారిని పక్కన పెట్టి నిన్న, మొన్న పార్టీలోకి వచ్చిన వారికి బద్వేలు తాలూకా ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి విలువ ఇస్తున్నారని, కొందరు టీడీపీ నాయకులు కార్యక్రమానికి డుమ్మాకొట్టినట్లు తెలిసింది. కార్యక్రమంలో బద్వేలు తాలూకా టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి, బీజేపీ నాయకులు రోశన్న, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు బాలనరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.